

# ఎన్నారై ముచ్చట్లు

-సత్యం మందపాటి



(గతసంచిక తరువాయి)

## 13. సత్యాన్వేషణ!

రాజకుమారుడు గౌతమ సిద్ధార్థుడు ఎంతో సుకుమారంగా, బయట ప్రపంచం చూడకుండా నాలుగు కోటగోడల మధ్య పుట్టి, పెరిగి పెద్దవాడయాడు. దానికి కారణం తండ్రి శుద్ధోధన మహారాజుకి ఆనాటి జ్యోతిష్కులు అతను పెరిగి పెద్దవాడయాక, ఒక సన్యాసిగా అవుతాడని చెప్పారుట. తనలాగా గొప్ప మహారాజు అవవలసిన యువరాజు, అలా సన్యాసి అవటం ఆయనకి నచ్చలేదు. అందుకే ఆయన సిద్ధార్థుడిని ఇటు జీవితంలోని కష్టనష్టాలకూ, బాధలకూ దూరంగా వుంచి, ఎన్నడూ బయట ప్రపంచాన్ని చూడకుండా జాగ్రత్తగా పెంచాడుట.

పెద్దవాడయాక మొట్టమొదటిసారిగా తండ్రికి తెలియకుండా ఒక్కడే బాహ్యప్రపంచంలోకి అడుగుపెట్టాడు సిద్ధార్థుడు. ఆరోగ్యం క్షీణించి బాధ పడుతున్న ఒక రోగినీ, వయసుమళ్ళి చావుకి సిద్ధంగా వున్న ముసలివాడినీ, కొంతమంది ఏడుస్తూ స్మశానానికి మోసుకు వెడుతున్న శవాన్నీ అప్పుడే మొదటిసారిగా చూశాడు సిద్ధార్థుడు. అవి చూశాక అతని మనసు కలతపడింది. అతనిలో ఎన్నో ప్రశ్నలు ఒక్కసారిగా పెల్లుబికాయి. తర్వాత రాజ్యపాలనని తృణీకరించి, ఆయన తన ప్రశ్నలకు సమాధానాలు తనే వెతుక్కుంటూ బయల్దేరాడు.

అసలు జీవితమంటే ఏమిటి? దానికి ఒక అర్థమంటూ వున్నదా? ఎంతో అందంగా పుట్టి పెరిగిన మానవ శరీరం క్షీణించటం ఎందుకు? రోగాలతో బ్రతుకు ఎందుకు? పుట్టినవాడికి చావు అనేది ఎందుకు?

అంతటితో ఆగలేదు. మరి పుట్టుక, చావు అనేవి రెండూ సత్యమే అయినప్పుడు, మనిషి బ్రతికున్నంత కాలం తోటి ప్రాణకోటితో మానవత్వంతో మంచిమనిషిగా బ్రతకక, తనే సృష్టించుకున్న మతం పేరుతో ఏదో తెలియని మాయలో పడటం ఎందుకు? ఇలాటి ప్రశ్నలతో తన సత్యాన్వేషణ మొదలు పెట్టాడు సిద్ధార్థుడు.

ఆ సత్యాన్వేషణలో ఆయన మనసుకి నచ్చిన జవాబులు ఏ మత గ్రంథంలోనూ కనపడలేదు.

ఏ మత గురువుల దగ్గరా, మేధావుల దగ్గరా కూడా సరైన జవాబులు రాలేదు.

ఎక్కడో వున్నదో లేదో తెలియని మాయాలోకాన్ని చేరుకోవటానికని అర్థంలేని, అర్థంకాని ఆచార వ్యవహారాల తంతుల్లో మునిగిపోయిన ప్రాణకోటి భావాలు ఆయన సత్యాన్వేషణకి ఏమాత్రం ఉపయోగపడలేదు.

"ఈ జ్ఞాన సముపార్జన ఎక్కడినించో రాదు. మాయ అనే ముసుగు తొలగించి, సమతా మమతలతో మనమే మనలోకి తొంగి చూడాలి. ఆ అన్వేషణకి జవాబు మన అంతరంగంలోనే వుంది" అని ఎంతో పట్టుదలతో తన అన్వేషణ కొనసాగించాడు సిద్ధార్థుడు.

ఇది క్రీస్తు పూర్వం నాలుగు వందల యాభై సంవత్సరాలకి ముందుగా జరిగింది.

○ ○ ○

దాదాపు రెండున్నర వేల సంవత్సరాల తర్వాత, శ్రీరంగం శ్రీనివాసరావు అనబడే మహాకవి శ్రీశ్రీకి కూడా, ఈ సత్యాన్వేషణలో ఎన్నో ప్రశ్నలు ఉదయించాయి.

'ఏది చీకటి? ఏది వెలుతురు? ఏది జీవితం? ఏది మృత్యువు? ఏది పుణ్యం? ఏది పాపం? ఏది నరకం? ఏది నాకం? ఏది సత్యం? ఏదసత్యం? ఏది నిత్యం? ఏదనిత్యం? ఏది ఏకం? ఏదనేకం? ఏది కారణమేది కార్యం? ఓ మహాత్మా! ఓ మహర్షీ!' అని ప్రశ్నించాడు.

ప్రపంచంలోని అందరి బాధా ఆయనదే కదా మరి!

○ ○ ○

తర్వాత కొన్నేళ్ళకి, చలన చిత్ర వ్యాసమహర్షి సముద్రాలకీ 'జీవిత సత్యాలకి నిర్వచనం' మీద ఇలాటివే ఎన్నో ప్రశ్నలు వచ్చాయి.

'సృష్టి చేసినది మరి దేవుడయితే మరి నాశనాన్ని ఎందుకు సృష్టించాడనీ, వెలుతురునిచ్చిన దేవుడు చీకటిని ఎందుకు ఇచ్చాడనీ, కళ్ళు ఇచ్చిన దేవుడే మరి అంధులని ఎందుకు సృజించాడనీ, జీవితాన్ని ఇచ్చిన దేవుడు మరి చావునెందుకు ఇచ్చాడనీ'... ఇలాటి ఎన్నో ప్రశ్నలని అడుగుతారాయన ఒక పాటలో. ఆ పాటలో ఆయన ఇచ్చిన జవాబు మాత్రం నాకేమాత్రం నచ్చలేదు. 'ఎన్నో వేదశాస్త్రాలు చదివినవారికే ఆ సృష్టి రహస్యం బోధపడలేదు, అల్పబుద్ధితో ఆ జ్ఞానదాతని పరిహాసం చేయకూడదు' అంటారు ఆయన.

మరి ఆ జ్ఞానం ఏమిటి? ఆ జ్ఞానదాత ఎవరు? ఆ జ్ఞానాన్ని మనకి అర్థమయే విధంగా చెప్పాడా?

మన పిల్లలు ఏదైనా తెలివైన ప్రశ్న అడిగితే, మనకి జవాబు తెలియదు కనుక, 'వెధవా, ఇంతున్నావు ఏమిటా పిచ్చి ప్రశ్నలు, కళ్ళు పోతాయి. నోరు మూసుకో' అన్నట్టుగా వుంది ఆయన జవాబు!

సత్యాన్వేషణలో ముఖ్యంగా కావలసినవి ప్రశ్నలు, వాటికి జవాబులు! మరి ప్రశ్నించ వద్దంటే ఎలా?

పక్షులని చూసి మనిషి కూడా ఎందుకు ఎగరలేడు అనే ప్రశ్నకి సమాధానమే ఈనాటి విమానాలు. ఆకాశంలో ఏముందో తెలుసుకోవాలనే కుతూహలమే ఈనాటి అంతరిక్ష యానాలు. మానవ శరీర నిర్మాణం గురించి వచ్చిన ప్రశ్నలకి

జవాబే ఈనాటి విస్తారమైన వైద్యశాస్త్రం. కాబట్టి మనకి వచ్చే ప్రశ్నలకి జవాబులు తెలుసుకోవటం, కనీసం తెలుసుకోవటానికి ప్రయత్నించటం ఎంతో అవసరం.

కాకపోతే కొన్ని ప్రశ్నలకి జవాబులు వెంటనే దొరుకుతాయి. కొన్ని పరిశీలనతో దొరుకుతాయి. కొన్ని పరిశోధన వల్ల దొరుకుతాయి. కొన్ని మనకి అందుబాటులో వున్న మాధ్యమాలతో దొరకకపోవచ్చు.

మళ్ళీ మహాకవి శ్రీశ్రీ అన్నట్టు, ‘ఏదీ తనంత తానై నీ దరికి రాదు. శోధించి సాధించాలి’’.

ం ం ం

‘మరి నీ సంగతి ఏమిటయ్యా? ఇహ నీ ప్రశ్నలు ఏమిటి?’ అని మీరు అడుగుతారని నాకు తెలుసు.

వస్తున్నా.. వస్తున్నా.. అసలు ఈ వ్యాసమే దాని గురించి కదా మరి.

నాకు చిన్నప్పటినించీ మానవత్వం మీదా, మనుష్యుల భావావేశాల మీదా, అనుబంధాల మీదా, ఆ విషయ సంబంధమైన పుస్తకాల మీదా, ఆ సమాచారం మీదా మక్కువ ఎక్కువ. మనసుని కదిలించే అటువంటి కొన్ని సన్నివేశాలు వింటుంటే, నా హృదయం స్పందించి కళ్ళల్లో నీటి బొట్లు రావటం కూడా సహజమే. అలాగే, అలాటి మానవత్వం మరచి తమ దానవత్వం చూపించే వ్యక్తుల మీద ఆగ్రహం రావటం కూడా నా తత్వంలో ఒక భాగమే. అదీకాక నాకు సాంస్కృతిక మానవ శాస్త్రం (Cultural Anthropology) అంటే ఎంతో ఇష్టం కనుక, నేను వ్రాసిన కథలలో, వ్యాసాలలో ఆ ప్రభావం కనిపిస్తూ వుంటుందని అంటుంటారు అవి చదివినవారు, అదేమిటో తెలిసినవారు.

రోజురోజుకీ హరించుకుపోతున్న మానవత్వపు విలువలు, పెరిగిపోతున్న స్వార్ధం, క్షీణించిపోతున్న మనిషికీ మనిషికీ మధ్య వుండవలసిన అనుబంధం, మనిషి మనిషిగా పుట్టినందుకు మనిషిగా ఎందుకు బ్రతకలేకపోతున్నాడనే ఆవేదన ఎన్నాళ్ళనించో నా ఆలోచనలను ఇటూ, అటూ, ఎటో తీసుకువెడుతున్నాయి.

ఒకే జాతికి చెందిన పశువులూ, జంతువులే ఈనాటికీ కలసి మెలసి వుంటున్నప్పుడు, వాటిలోనించే వచ్చిన మనిషి, వాటి కన్నా తెలివితేటలు తనకే ఎక్కువగా వున్నాయనుకుంటూ కూడా, తన పక్కవాడినే ఎందుకు వేధిస్తున్నాడు? ఎందుకు పీక్కుతింటున్నాడు? తన ఆధిక్యత కోసం ఎందుకలా అల్లల్లాడుతున్నాడు? అతనిలో క్షమ, దాక్షిణ్యం, ప్రేమా, అనురాగం, మమతా, సమతా... అన్నిటికీ మించి మానవత్వం ఏమయాయి? ఎక్కడికి పోయాయి?

భౌతిక జీవితం అనుభవించటానికి ఈ భౌతిక ప్రప్రపంచంలో పుట్టిన మనిషి, ఇహాలో తన జీవితాన్ని స్వర్గతుల్యం చేసుకోవాలిగానీ, ఇలా ఎందుకు నరకమయం చేస్తున్నాడు? చేసుకుంటున్నాడు?

దానికి జవాబు, స్వార్ధమా?

అహంభావమా?

అభద్రతా భావమా?

మనిషి మళ్ళీ ఈ జన్మలోనే మనిషిగా ఎప్పుడు మారతాడు?

ఎప్పుడు మళ్ళీ మనిషిగా జీవిస్తాడు?

ం ం ం

ఇప్పుడు మళ్ళీ గౌతముడు తన సత్యాన్వేషణలో ఏం చూశాడో, ఏం పాటించాడో చూద్దాం.

గౌతమ బుద్ధుడు ఒక దేవుడు కాదు. బౌద్ధం ఒక మతం కాదు. ఆయన చెప్పిన తన సత్యాన్వేషణని విని అది అక్షరాలా పాటించేవారు ఆయనలాగానే ఎవరో ఎక్కడో దేవుడో, తెలియని శక్తో వుందని నమ్మరు. గుడిలోనూ, చర్చిల్లోనూ, మసీదుల్లోనూ చేసే తంతులకు వ్యతిరేకులు.

గౌతముడు తను శోధించిన సత్యాన్నే తను పాటించాడు. ఆయన తనని అనుసరించమని ఎవరినీ కోరలేదు. వారినే గౌతముడి అనంతరం బౌద్ధులు అలా అన్నారుగానీ ఆయన తను ఒక కారణ జన్ముడిననీ, తన సూక్తులు పాటించమనీ ఎప్పుడూ అనలేదు. తన సత్యాన్వేషణ తనది. అంతే!

మనిషిగా పుట్టినందుకు మనిషిగా జీవించటం అవసరమనేదే వారి లక్ష్యం. మరణించిన తర్వాత జీవితం వున్నదని వారు నమ్మరు. అందుకే బ్రతికున్నంత కాలం, మానవత్వంతో మమతా సమతలతో మనిషిగా జీవించమని చెబుతారు. వారి దృష్టిలో ఎవరి కర్మలకు తమ జీవిత కాలంలోనే వారే బాధ్యులు.

ఏనాడో, మనిషి ఆదిమానవుడిగా వున్నప్పుడే తమ చిన్న సమూహాలలో క్రమశిక్షణతో జీవించటం కోసం కొన్ని సూత్రాలూ, ధర్మాలు పెట్టుకుని జీవించేవారు. అవే కొన్ని తరాల తర్వాత మతాలయాయి. అలా పెరిగి పెరిగి, ఈనాటి ప్రపంచంలో నాలుగు వేల పైచిలుకు మతాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి క్రిస్టియానిటీ, ఇస్లాం, హిందూ, టావోయిజం, జుడాయిజం, సిక్కు, జైన్, బహాయ్... ఇలా ఎన్నో వున్నాయి.

కొన్నిటిని అవి మతాలు కాదన్నా, వాటిని మతాలుగానే పిలుస్తున్నారు. అలాగే 'దేవుడు' అనే ఆలోచనే మానవ కల్పితం అన్న భౌద్ధంలోనే, బుద్ధుడిని కొద్దిమంది దేవుడిగా కొలుస్తున్నారు. హిందూమతంలోనించీ బయటికి వెళ్ళిపోయిన బుద్ధుడిని దశావతారాల్లో కూడా చేర్చేశారు. ఆచారాలు, తంతులు సత్యాన్వేషణకి అడ్డు అనే ఆ భౌద్ధంలోనే ఇప్పుడు పసిఫిక్ ఆసియా ఉపఖండంలో పూజలూ పునస్కారాలూ చేసేవాళ్ళూ వున్నారు. జపాన్‌లోనూ, చైనాలోనూ, తైవాన్‌లోనూ ఎన్నో బుద్ధుని గుళ్ళు చూసి అదే అనుకున్నాను.

అయినా బుద్ధుడి సత్యాన్వేషణ ఫలితాలని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నబౌద్ధ సన్యాసులు మాత్రం, ఆయన ధర్మ సూత్రాలని మాత్రమే పాటిస్తున్నారు.

మరి ఆ బౌద్ధ సూత్రాలు ఏమిటయ్యా? అని అడుగుతున్నారు కదూ.

చెబుతాను. ప్రపంచంలోని ముఖ్యమతాలు, మనిషి చనిపోయిన తర్వాత వారు చేసుకున్న కర్మనుబట్టి, స్వర్గం, నరకం అనే చోట్లకి వెడతారనీ, అందుకని ఈ జన్మలో మంచి పనులు చేస్తే స్వర్గానికీ, లేదా నరకానికీ వెడతారని చెబుతాయి.

హిందువులు నమ్మేది కర్మఫలమే! మరి క్రిష్టియానిటీలో ఏది నమ్ముతారు? ఓల్డ్ టెస్టమెంటులో కర్మ సిద్ధాంత హిందూమతంలోలాగానే ఒకప్పుడుండేది. 'ఎవరి కర్మకు వారే బాధ్యులైనప్పుడు, చర్చికి వెళ్ళటం ఎందుకు? మేమే మాకు తోచిన మంచి పనులు చేసి స్వర్గానికి వెడతాము' అనే వాదన వస్తుంటే, కేథలిక్ చర్చి వారా సిద్ధాంతాన్ని మార్చి, న్యూ టెస్టమెంట్ విడుదల చేశారు. దానిలో భూమి మీద పుట్టేవారందరూ పాపులుగా పుడతారనీ (Born as sinners), ఏసుక్రీస్తుని నమ్మి, చర్చికి వెళ్ళి బైబుల్లోని మంచి విషయాలు తెలుసుకుని, వాటిని పాటిస్తే పుణ్యం వచ్చి స్వర్గానికి వెడతారనీ మార్పులు చేశారు. తత్ఫలితంగా చర్చిలకు వెళ్ళే జనాభా పెరిగి, అది ప్రపంచంలోనే అతి పెద్ద మతమయింది. అలాగే ఇస్లాం మతం కూడా, ఖురాన్ చదివి దానిలోని ధర్మాలని పాటిస్తే, మనిషి చనిపోయాక వెళ్ళటానికి ఏడు స్వర్గాలు వున్నాయి అని చెబుతుంది. కానీ ఇస్లాం మతంలోని కొన్ని శాఖలు మాత్రం, ఆ ఏడూ ఏడు స్వర్గాలు కాదనీ, ఒకే స్వర్గంలో వున్న ఏడు విభాగాలు అనీ నమ్ముతుంది.

'ఇదేమిటి రైటరూ, మతాల్లో శాఖలు అంటున్నావు. అదే మతాల్లో వుంది?' అని అడుగుతున్నాడు ఒక అనుమానాల మనిషి.

మానవమాత్రులం. మన మధ్య మనమే గీతలు గీసుకుని విడిపోక పోతే బాగుంటుందా మరి! నాకు అవి కొంచెం చూచాయగానే తెలుసు కానీ, ఎలా వున్నాయో, ఎందుకు వున్నాయో నిర్దిష్టంగా తెలియదు. కొన్ని మతాల్లో భజనలే కాక విభజనలూ వున్నాయని మాత్రం తెలుసు.

క్రిస్టియానిటీలో కేథలిక్స్, మెథడిష్టు, ప్రొటెస్టెంటు. ఈస్టరన్ ఆర్థొడాక్స్, పెంటెకోస్టు... ఇలా వున్నాయి. అలాగే ఇస్లాం మతంలో సున్ని, షియా, సూఫి, అహ్మదీయ... మొదలైన శాఖలున్నాయి. హిందూమతంలో కూడా శైవులూ, వైష్ణవులే కాక, ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం... ఇలా వున్నాయి. ఆ వివరాలు ఈ వ్యాసానికి అనవసరం. అంతేకాదు అవన్నీ వివరంగా చెప్పే జ్ఞానం కూడా నాకు లేదు.

ఇంతకీ చాల మతాలు చెప్పేది ఒకటే. ఈ జన్మలో మనుష్యుల కర్మఫలాన్నిబట్టి, తర్వాత జన్మలో స్వర్గ నరకాలు నిర్ణయించబడతాయి అనే సూత్రాన్ని గ్రంధీకరించాయి.

బుద్ధుడు మరో జన్మని నమ్మలేదు.

'పుట్టిన ప్రతిమనిషీ చనిపోతాడు. ఆ పుట్టుకకీ, చావుకీ మధ్య ఎన్నో సుఖాలున్నాయి, కష్టాలున్నాయి, విజయాలున్నాయి, అపజయాలున్నాయి. మనిషికీ మనిషికీ మధ్య బంధాలున్నాయి, వైరుధ్యాలున్నాయి. మనిషిగా జన్మ ఎత్తినందుకు, ఒక మంచిమనిషిగా బ్రతికి, అందరికీ మంచినే చేసి, సమతా మమతలతో నీ జన్మను సార్ధకం చేసుకుని, నీ జన్మను చాలించు. ప్రేమిస్తూ, ప్రేమని పంచుతూ నీ జన్మకు ఫలితం సాధించుకో' అనేదే వారి లక్ష్యం.

ఇక్కడ అమెరికాలో కూడా ఒక ఇంగ్లీష్ సామెత వుంది. **"Past is history. Future is mystery and today is present. Present is also called a gift. Enjoy your life today when you are alive!"** అని.

○ ○ ○

ఇంకొక ప్రశ్న కూడా వుంది. 'అసలు మనిషి మనుగడకు మతం అవసరమా?' అని.

ఒక పసిపాప పుట్టగానే ఆ పాపాయికి పేరు పెడతారు. ఆ పేరుతో పాటు ఒక కులం, మతం, జాతి, ఒక దేశ పౌరసత్వం వాటంతవే వచ్చేస్తాయి. ఆ పసిపాప స్వచ్ఛమైన మనస్సుకవేమిటో తెలియని వయసు. వయసు పెరిగిన కొద్దీ అవేమిటో తెలుసుకోవటానికే ఎన్నో ప్రశ్నలు అడగటం జరుగుతుంది. మరవి క్షుణ్ణంగా తెలిసినవారు సరైన జవాబులు చెప్పాలి. లేకపోతే ఆ అర్థములేని బట్టీ చదువు వ్యర్థమైపోతుంది.

ఇంకొక విషయం. ప్రపంచంలోని ఏ మతమూ చెడు చేయమని చెప్పదు. క్రమశిక్షణతో ఇతరులకు మంచి చేస్తూ, మంచిమనిషిగా మానవత్వంతో బ్రతకమనే చెబుతుంది. అదే కదా ఏ మతానికైనా లక్ష్యం.

అందుకే మతం అవసరం అనుకునే వాళ్ళకి ఆ ఆలోచన ఆలంబనమయితే వారికి మతం అవసరమే!

అలాకాక 'మంచి మనిషిగా నేను జీవిస్తాను, మతంతో నాకు పని లేదు' అనేవారికి అది అనవసరమే!

ప్రపంచంలో క్రిస్టియన్లు, ముస్లిములు, ఏ మతమూ నమ్మని వారూ, హిందువులు... అదే వరసలో మొదటి నాలుగు స్థానాల్లో వున్నారు.

ఇప్పుడు ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే తెలుస్తున్నది, మత ప్రమేయం లేకుండా మంచివారూ, చెడ్డవారూ అన్ని చోట్లా వున్నారు, వుంటారు అని.

○ ○ ○

మరి ఇంకో ప్రశ్న.

ఇవన్నీ తెలిసిన మనిషి ఈరోజు ఎందుకిలా తయారయాడు?

తన జీవితాన్నే కాక, సాటివారినీ, తన సమాజాన్ని, దేశాన్నీ కూడా ఎందుకు దోచుకుంటున్నాడు? మానవత్వమున్న మనిషిగా ఎందుకు బ్రతకలేక పోతున్నాడు?

○ ○ ○

ఈ వ్యాసం పూర్తి చేసే ముందు, నేను ఈమధ్య టీవీలో ఎన్నోసార్లు విన్న ఒక పాట గురించి చెప్పాలని వుంది. ఆ పాటలో మనకి, పై ప్రశ్నలకి కొన్నిటికైనా జవాబు దొరుకుతుందేమో చూడండి!

మనందరి ఇష్టుడు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు వెళ్ళిపోయాక, ఆయనలా ఎంతో గొప్ప పాటలు వ్రాస్తున్నది చంద్రబోసుగారు. ఆయన వ్రాసినదే ఈ పాట. నన్ను చంద్రబోసుగారికి అభిమానిగా చేసిన పాట. ఎన్నిసార్లు విన్నా ఒళ్ళు

పులకరించే పాట. మనల్ని తట్టి నిద్ర లేపే మాట. కీరవాణి బాణీతో, బాలు పాడిన పాట. పాడుతా తీయగా కార్యక్రమంలో చిరంజీవి వాగ్దేవి పాడినది యూట్యూబులో వుంది. అది తప్పక వినండి.

ఇదిగో ఆయన వ్రాసిన ఈ పాటః

‘దేశమంటే మతం కాదోయ్, దేశమంటే గతం కాదోయ్
దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుష్యులోయ్’ అనే పల్లవితో మొదలవుతుంది.

తర్వాత అన్నీ హృదయాన్ని హత్తుకునే పదాలే! మన కళ్ళల్లో అశ్రువులని కదిలించే చరణాలే!

ప్రేమించు, ప్రేమ పంచు, ప్రేమగా జీవించు
ద్వేషమెందుకు, సాటి మనిషిని సోదరుడిగా ఆదరించు
హింసలెందుకు, సమస్యలను ప్రేమతో పరిష్కరించు
క్రోధమెందుకు, కరుణ పంచు
స్వార్థమెందుకు, సహకరించు
పంతమెందుకు, పలుకరించు
కక్షలెందుకు, కౌగలించు
మల్లెపువ్వులాటి బాలల తెల్ల కాగితం బ్రతుకులు
రక్త చరితగ మారకుండా రక్ష కలిగించు
కొత్త బంగరు భవితని, నేడు కానుకగా అందించు
దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుష్యులోయ్!

○ ○ ○

‘మరి ఇదెలా సాధ్యం?’ అనేది ఒక గొప్ప ప్రశ్న.

ఎవరో ఎక్కడినించో ఊడిపడి మనకి కావలసినిన మంచి మార్పుని తీసుకురారు.

“ఏదన్నా మార్పు కావాలంటే, అది నీతోనే మొదలవాలి” అన్నారు మహాత్మా గాంధీగారు.

అదే నాకు తెలిసిన సత్యాన్వేషణ!

పూర్వజన్మలోనో, వచ్చే జన్మలోనో కాకుండా, ఈ జన్మలో మనిషిగా పుట్టినందుకు మంచిమనిషిగా బ్రతకటానికి ఏ మతం దశా దిశా చూపిస్తుందో, అదే నేను పాటించే మతం.

అదే నాకు సమ్మతం!

○ ○ ○

(మరో ముచ్చట వచ్చే నెలలో)

COMMENTS